
ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి 2


అమరుల త్యాగాలు వెలకట్టలేనివి 2



AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in


## మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తెలంగాణ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీని 10 మార్చి 2026 వరకు పొడిగించినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకపోయి ఉంటే వారు వెంటనే అప్లయ్ చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు కోసం సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీహెచ్ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.125 ఉండగా.. ఓసీ విద్యార్థులకు రూ.200 పరీక్ష రుసుము చెల్లించాలని సూచించారు.



## షబ్బీర్ అలీని కలిసిన టీఎన్జీవోస్ నేతలు



**అక్షరటుడే, ఇందూరు:** ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని టీఎన్జీవోస్ నేతలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో వారు ఆయనను కలిసి సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంప్లాయిస్ హెల్త్ స్కీంలో సానుకూలంగా వ్యవహరించడంలో కృషి చేసినందుకు షబ్బీర్‌అలీకి టీఎన్జీవోస్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, టీఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం. హుస్సేనీ ఆదేశానుసారం జిల్లా నేతలు షబ్బీర్‌ను కలిశారు. అనంతరం ఉమ్మడి జిల్లాల ఉద్యోగుల సమస్యలపై ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు షబ్బీర్ అలీతో చర్చించారు. ఎల్లప్పుడూ ఉద్యోగుల పక్షాన నిలుస్తున్న ప్రభుత్వం మిగతా సమస్యలపై కూడా స్పందించాలని వారు కోరారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, ఆర్మూర్ యూనిట్ అధ్యక్షుడు శశికాంత్ రెడ్డి, భీమ్‌గల్ యూనిట్ అధ్యక్షుడు సృజన్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన కుటుంబాలకు అండగా ప్రభుత్వం



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణ కేంద్రంలో లబ్ధిదారులకు ఆదివారం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. వ్యవసాయ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి 178 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1,78,20,648 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా కృషి చేస్తామని తెలిపారు. బాన్సువాడ గ్రామీణ మండలంలో 54 మంది లబ్ధిదారులకు రూ.54,06,264, బాన్సువాడ పట్టణంలో 30 మంది లబ్ధిదారులకు రూ.30,03,480, నస్రుల్లాబద్ మండలంలో 74 మంది లబ్ధిదారులకు రూ.74,08,584, బీర్కూర్ మండలంలో 20 మంది లబ్ధిదారులకు రూ.20,02,320 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఎర్రజొన్నపై అనాసక్తి



**ఎర్రజొన్న సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. మద్దతు ధర లేకపోవడం, వ్యాపారులు సిండికేట్ కావడంతో ప్రతి సంవత్సరం అన్నదాతలు నష్టపోతున్నారు. దీంతో పంట సాగుకు ముందుకు రావడం లేదు. ఆర్మూర్ డివిజన్‌లో ఒకప్పుడు యాసంగి సీజన్‌లో 40 వేల నుంచి 50 వేల ఎకరాల్లో సాగైన పంట ప్రస్తుతం 20 వేల ఎకరాలకు మించడం లేదు.**

**-అక్షరటుడే, ఆర్మూర్**

- మద్దతు ధర లేకపోవడంతో ముందుకు రాని రైతులు
- తగ్గిన సాగు విస్తీర్ణం
- జోరుగా మొక్కజొన్న సాగు

ఎర్ర జొన్న పంటను ఆర్మూర్ డివిజన్‌లో అధికంగా సాగు చేస్తారు. యాసంగి సీజన్‌లో ఏ ప్రాంతానికి వెళ్లిన ఎర్ర తివాచి పరిచినట్టుగా ఎర్రజొన్న పంట దర్శనం ఇచ్చేది. దీనిని పలు రాష్ట్రాల్లో పశువుల దాణాగా వినియోగిస్తారు. ఇందులో ఇనుము, ఫైబర్, యాంటీ యాక్సిడెంట్లను అధికంగా ఉంటాయి. దీంతో వ్యాపారులు బై బ్యాక్ ఒప్పందాలు చేసుకొని గతంలో రైతులకు విత్తనాలు ఇచ్చేవారు. అయితే రానురాను వ్యాపారులు, దళారులు సిండికేట్ అయి ఎర్రజొన్నల ధరలను తగ్గించడం మొదలు పెట్టారు. బై బ్యాక్ ఒప్పందాలు కూడా సక్రమంగా అమలు చేయడం లేదు. దీంతో అన్నదాతలు ఎర్రజొన్న సాగుకు ఆసక్తి చూపడం లేదు.

### తగ్గిన సాగు విస్తీర్ణం..

ఆర్మూర్ ప్రాంతంలో సాగు చేసిన ఎర్రజొన్నలను పశుగ్రాసం విత్తనాల కోసం బీహార్, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు రవాణా చేస్తారు. కర్ణాటకలోని బళ్లారి, ఢిల్లీ నగరంలో ఎర్రజొన్నకు డిమాండ్ ఉంది. ఆర్మూర్ డివిజన్‌లో గతంలో 40 వేల ఎకరాల నుంచి 50 వేల ఎకరాల వరకు ఎర్రజొన్న సాగు చేయగా గత రెండు మూడు ఏళ్లుగా సాగు విస్తీర్ణం భారీగా తగ్గింది. గతేడాది 25 వేల ఎకరాల్లో పంట వేయగా.. ఈ సారి 20 వేల ఎకరాల్లోపే సాగు చేశారు. ప్రస్తుతం ఎర్రజొన్నలు క్వింటాల్‌కు రూ. 3600 నుంచి రూ.3800 వరకు ధరను చెల్లిస్తున్నారు. సాగు విస్తీర్ణం తగ్గినందున ఎర్రజోన్నలకు డిమాండ్ ఉంటుందని కనీసం రూ. 5వేల పైచిలుకు మద్దతు ధర చెల్లిస్తే రైతులకు గిట్టుబాటు అవుతుందని రైతుల ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### మక్కకు మంచి ధర

రాష్ట్రంలో గత రెండు మూడేళ్లుగా మొక్కజొన్నలకు మంచి ధర వస్తోంది. దీంతో ఆర్మూర్ ప్రాంతంలోని రైతులు మక్క సాగుకు ఆసక్తి చూపుతున్నారు. డిమాండ్ పెరగడంతో మక్కలకు ధర లభిస్తోంది. ప్రభుత్వ మద్దతు ధర కంటే ఎక్కువ చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో అన్నదాతలు ఎర్రజొన్నలకు బదులు మొక్కజొన్న వేస్తున్నారు.

### మద్దతు ధర ఇవ్వాలి



ఎర్రజొన్నలకు మద్దతు ధర విషయమై కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి విన్నవించాం. దిగుబడి తగ్గినందున ఎర్ర జొన్నలకు డిమాండ్ ఉంటుంది. క్వింటాల్‌కు రూ. 5 వేలపై ధర వచ్చేలా చూడాలని కోరాం. ధర లేకపోవడంతో కొంతకాలంగా రైతులు సాగుకు ముందుకు రావడం లేదు.

**– నూతుల శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ కిషన్ మోర్చా నేత**

### రైతులకు లాభం చేకూర్చాలి



ఎర్రజొన్న పండించడానికి రైతులు ముందుకు రావడం లేదు. ఆర్మూర్ డివిజన్‌లో ఎటు చూసినా ఎర్రజొన్న కనిపించేది. ఈ సారి రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ఎర్రజొన్న క్వింటాలుకు రూ.4,500 నుంచి రూ.5 వేల ధర చెల్లిస్తే రైతులకు లాభం వస్తుంది.


**–అల్లూరి గంగారెడ్డి, రైతు, పెర్కిట్**

## హోలీని పురస్కరించుకొని నిబంధనలు పాటించాలి



**అక్షరటుడే, ఇందూరు:** హోలీ పండుగను పురస్కరించుకొని జిల్లా ప్రజలు పోలీసులు సూచించిన నిబంధనలు పాటించాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఓ ప్రకటనలో తెలిపారు. పోలీసు నివేదికల ప్రకారం కొంతమంది హోలీ పండుగ సందర్భంగా రహదారుల్లో బహిరంగ ప్రదేశాల్లో ఇష్టపడని వ్యక్తులు ప్రదేశాలు వాహనాలపై రంగులు లేదా నీటిని చల్లడం నిషేధించామన్నారు. కావున శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తించవద్దని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తులపై నిజామాబాద్ పోలీస్ చట్టంలోని సెక్షన్ 76 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 2న సాయంత్రం 6 గంటల నుంచి 5వ తేదీ ఉదయం 6 గంటల వరకు నిబంధనలు అమలులో ఉంటాయని ఉత్తర్వులు జారీ చేశారు.

## చిరుత పులి దాడిలో లేగ దూడ మృతి



**అక్షరటుడే, గాంధారి:** చిరుత దాడిలో లేగ దూడ మృతి చెందింది. ఈ ఘటన గాంధారి బ మండలంలో చోటు చేసుకుంది. గాంధారి ఎఫ్‌ఆర్‌వో హేమచందన తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలంలోని రామ్ లక్ష్మణ పల్లి శివారు ప్రాంతంలో లేగదూడ గడ్డి మేసేందుకు వెళ్లగా చిరుత దాడిచేయగా లేగ మృతి చెందింది. స్థానికులు, గ్రామస్థులు సమాచారం ఇవ్వగా అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. లేగపై దాడి ఘటన మోతె శివారుకు వస్తుందని అక్కడి అటవీశాఖ సిబ్బంది సమక్షంలో పంచనామా నిర్వహించడం జరిగిందని ఎఫ్‌ఆర్‌వో తెలిపారు. బాధితుడికి నష్టపరిహారం అందజేయడం జరుగుతుందన్నారు.

## బాబ్లీ ప్రాజెక్ట్ గేట్ల ఎత్తివేత



**అక్షరటుడే, బాల్కొండ:** శ్రీరాంసాగర్ ఎగువన మహారాష్ట్రలో ఉన్న బాబ్లీ ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేవారు. నాందేడ్ నీటిపారుదల శాఖ అధికారులు నీటి విడుదల ప్రారంభించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బాబ్లీ గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఏటా వేసవి కాలంలో తాగునీటి అవసరాల నిమిత్తం మార్చి 1న బాబ్లీగేట్లు ఎత్తాలని అత్యున్నత న్యాయస్థానం నుంచి ఆదేశాలున్నాయి. ఈ మేరకు అధికారులు ఆదివారం 0.06 టీఎంసీల నీటిని దిగువకు వదులుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నీళ్లు త్వరలో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌ను చేరుకోనున్నాయి. ఈ కార్యక్రమానికి ఇరురాష్ట్రాల నీరు పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు. జలవనరుల నిర్వహణలో భాగంగా నీటి విడుదల చేపట్టినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అప్పర్ గోదావరి డివిజన్, సెంట్రల్ వాటర్ కమిషన్, హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఫ్రాంక్లిన్, నాందేడ్ ఇరిగేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీఆర్ బన్సోడ్, బాబ్లీ ఇరిగేషన్ సబ్‌డివిజన్, ఉమ్రీ సబ్ డివిజనల్ ఆఫీసర్ చైతన్య, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికొట్ట, నాందేడ్ పూర్ణ సబ్‌డివిజన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ భూషణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపులు ఐక్యంగా ఉండాలి



**అక్షరటుడే, ఇందూరు:** మున్నూరు కాపు కులస్థులంతా ఐక్యంగా ఉండి అభివృద్ధి కోసం పాటుపడాలని మాజీ మేయర్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ అన్నారు. నూతనంగా ఎన్నికైన మున్నూరు కాపు కార్పొరేటర్లు, కౌన్సిలర్లను జిల్లా మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులస్తులందరూ ఒక తాటిపైకి వచ్చి ఒకరి నొకరు సహాయ సహకారాలు అందించుకోవడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశం అన్నారు. కొందరు కులాన్ని మనుషులను విభజించాలని చూస్తున్నారని, కానీ తాము మాత్రం డీఎస్ అడుగుజాడల్లో అందరినీ కలుపుకొని పోవాలనే చూస్తున్నామన్నారు. కొందరి నాయకుల స్వార్థ రాజకీయాలకు అమాయకులు బలవుతున్నారన్నారు. సన్మాన కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీకి చెందిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో వారికి కేటాయించిన కుర్చీలకు సన్మానించారు. రాజకీయాలకతీతంగా మున్నూరు కాపు కులస్థులందరినీ కలుపుకొని పోవాలనేది తమ ఉద్దేశమని సంజయ్ పేర్కొన్నారు. కానీ కొందరు తమ మధ్య చిచ్చు పెట్టడం సమంజసం కాదన్నారు. కార్యక్రమానికి రావాలని ఉన్న కొన్ని అరాచక శక్తుల వల్ల రాలేకపోయారన్నారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ఎస్ వందేళ్ల ప్రయాణానికి ప్రాణం 'నిత్యశాఖ'







**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందేళ్ల ప్రయాణానికి ప్రాణం నిత్యశాఖ మాత్రమేనని, శాఖలో తయారైన కోట్లాదిమంది స్వయం సేవకులు దేశంకోసం పనిచేస్తున్నారని ఆర్ఎస్ఎస్ తెలంగాణ సహప్రాంత ప్రచారక్ కల్పగురి ప్రభు కుమార్ తెలిపారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల మైదానంలో నగర సంగమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వందేళ్ల ప్రయాణంలో దేశంలోని అన్ని ప్రాంతాలకు ఆర్ఎస్ఎస్ విస్తరించిందని, కార్యకర్తల సంఖ్య పెరిగిన ప్రతిచోట సమాజంలో సౌభ్రాతృత్వం, దేశభక్తి పెరిగి ఆయా ప్రాంతాలు సుభిక్షంగా ఉన్నాయన్నారు. ఎంతోమంది దేశభక్తులు స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న వారు కూడా సంఘ కార్యం ఆవశ్యకతను గుర్తించారని తెలిపారు. సంఘస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ భారతదేశంలో స్వాతంత్రం కోల్పోవడానికి మూల కారణమైన అసంఘటిత హిందూ సమాజాన్ని సంఘటితంగా చేయడం మాత్రమే దీనికి శాశ్వతమైన పరిష్కారమని గుర్తించారని చెప్పారు. అందుకే ఆయన నిత్య శాఖ అనే మూలమంత్రాన్ని సంఘం సిద్ధాంత భూమికగా తయారు చేశారన్నారు. ప్రతిరోజూ ఒక గంట పాటు కలిసి చేసే పనుల వల్ల వ్యక్తుల మధ్య సమన్వయం ఏర్పడి, ఆ వ్యక్తుల సమూహం, సమాజం, ధర్మం కోసం, దేశం కోసం పనిచేసేలా ప్రభుకుమార్ రగులుతుందన్నారు. శాఖలో 40 నిమిషాల శారీరక కార్యక్రమాల ద్వారా స్వయం సేవకుల శారీరక సౌష్టవం, ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. 10 నిమిషాలు బౌద్ధిక్ కార్యక్రమాల వల్ల దేశభక్తి, ధర్మ నిష్ట అలవాటు చేసుకుంటారని వివరించారు.

### ఇందూరు ఎంతో చారిత్రక నేపథ్యం..

ఇందూరు ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన నగరమని, ఇక్కడి హిందువులు ఎంతో ధర్మనిష్ట కలిగిన వారిని ప్రభుకుమార్ ప్రశంసించారు. సంఘం ప్రారంభమై వందేళ్లు పూర్తికావడం.. ఇందూరులో మొట్టమొదటి సంఘ శాఖ ప్రారంభమై 75 సంవత్సరాలు పూర్తి కావడం ఎంతో ప్రత్యేకమైందన్నారు. క్రమశిక్షణ, సమయపాలన, దేశభక్తి, ధర్మనిష్ట, వ్యక్తిగత శీలం, జాతీయ శీలం, సంస్కారం, సంస్కృతి పరిరక్షణ అనే ఎన్నో సుగుణాలను శాఖ ఆధారంగా స్వయంసేవకులు ఉపాసన చేస్తున్నారని గుర్తు చేశారు. ఆర్ఎస్ఎస్ శాఖ అంటే సమాజ సంస్కారాలకు కేంద్ర బిందువు అని, ఏ రాజకీయ అవసరాలు లేవని స్పష్టం చేశారు. శాఖలేని బస్తీల్లో శాఖలు ప్రారంభించాలని, శతాబ్ది సందర్భంగా శాఖ లేని బస్తీ ఉండకూడదని తెలిపారు. కేవలం ఒకసారి చేసే సాధన కాదని, సమాజ కల్యాణం కోసం భరతమాత కోసం నిరంతరం నిర్విరామంగా ఆచరించే ఒక పవిత్ర యజ్ఞంగా భావించాలని పిలుపునిచ్చారు. సంఘ శాఖ కేవలం ఆర్ఎస్ఎస్ కోసం కాదని సమాజంలో విపత్తులు, సమస్యలు, ఉపద్రవాలు వచ్చినప్పుడు సకాలంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం కోసం, ప్రజలను కాపాడడం కోసమని తెలిపారు. కార్యక్రమంలో నగర కార్యవాహ అర్గుల సత్యం, సహకార్యవాహ్‌లు సుమిత్ కుమార్, వెంకటేష్, నగర, జిల్లా స్వయం సేవకులు తదితరులు పాల్గొన్నారు.

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND.
2
నిజామాబాద్/కామారెడ్డి
ఆదివారం
1.3.2026
www.aksharatoday.in
AKSHARA TODAY

## ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తున్నాం




**అక్షరటుడే, ఆర్మూర్:** అమెరికా,ఇజ్రాయిల్ ఇరాన్‌పై దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తాలోని భగత్‌సింగ్ చౌక్ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం న్యూడెమోక్రసీ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దాసు మాట్లాడుతూ.. అమెరికా దేశ అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచ శాంతి అంటూనే పశ్చిమ ఆసియాపై తమ దాడులను కొనసాగిస్తున్నాడన్నారు. ఇరాన్ దేశంపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడిని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఖండించి, ప్రజాస్వామ్య విలువల పట్ల ఉన్న నిబద్ధతను చూపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ ఆర్మూర్ సబ్ డివిజన్ కార్యదర్శి సూర్య శివాజీ, ప్రజా సంఘాల నాయకులు ప్రిన్స్, వెంకటేష్, భానుచందర్, మగ్దూం పటేల్, ఇంద్రకరణ్ రెడ్డి, గౌస్, వర్ణారెడ్డి, సోయల్, గణేష్, హన్మంత్ రెడ్డి, గోపాల్, కళ్యాణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్కొండ ఖాజీగా ఫయాజ్ మోహియుద్దీన్




**అక్షరటుడే, బాల్కొండ:** బాల్కొండ ఖాజీ (వివాహ పురోహితుడు)గా ఫయాజ్ మోహియుద్దీన్ అన్సారీని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని ఆదివారం బాల్కొండ మండల కేంద్రంలోని తన కార్యాలయంలో ఆయన వెల్లడించారు. ఉత్తర్వుల ప్రకారం బాల్కొండ, ఆర్మూర్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, జక్రాన్‌పల్లి, ఆలూరు, నందిపేట్, డొంకేశ్వర్, ముప్కాల్, మెండోరా, ఎర్గట్ల, వేల్పూర్ మండలాల పరిధిలో వివాహాలు నిర్వహించే అధికారాన్ని తనకు కల్పించినట్లు తెలిపారు. తన తండ్రి సుమారు 80ఏళ్లపాటు ఈ ప్రాంతంలో ఖాజీగా సేవలందించారని, అదే విధంగా తాను కూడా సేవలందిస్తానన్నారు. ఈ సందర్భంగా బాల్కొండ నూతన ఖాజీని బాల్కొండ మర్కస్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మజారుద్దీన్, మాజీ కోఆప్షన్ సభ్యుడు షాహిద్, మైనార్టీ నాయకులు షేక్ వహాబ్, యునుస్, సయ్యద్ రియాజ్, ఇమ్రాన్, సయ్యద్ సంసుద్దీన్ తదితరులు అభినందించారు.

## మున్సిపల్ ఉద్యోగికి చైర్మన్ భర్త క్షమాపణ చెప్పాలి




**అక్షరటుడే, కామారెడ్డి :** మహిళా ఉద్యోగి అని చూడకుండా కంటతడి పెట్టించి అవమానపరిచిన మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త బహిరంగ క్షమాపణ చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్ డిమాండ్ చేశారు. కామారెడ్డి మున్సిపాలిటీలో భార్య మున్సిపల్ చైర్‌పర్సన్ ఉంటే భర్తల ఆధిపత్యం తరతరాల నుండి కొనసాగుతుందన్నారు. శనివారం రాత్రి 7:30 నుండి 8 గంటల వరకు మహిళ ఉద్యోగిని పనిచేయాలని చెప్పడంతోపాటు తోటి ఉద్యోగుల ముందు అవమానించిన చైర్‌పర్సన్ భర్తపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎలాంటి అర్హత లేకున్నా మున్సిపల్ కార్యాలయంలో రాత్రిపూట ఉద్యోగులను బెదిరిస్తున్నా.. కమిషనర్ పట్టించుకోవడం లేదన్నారు. కౌన్సిలర్ల భర్తలకు రాజ్యాంగం ప్రకారం ఎలాంటి హక్కు లేదని, చైర్‌పర్సన్ భర్త ఈ విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బాలరాజ్, జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, శ్రీనివాస్, ఆనంద్ పాల్గొన్నారు.



**జిల్లాలోని భీమ్‌గల్ మండలం ముచ్కూర్ గ్రామ శివారులో పెద్దగుట్ట ఆధ్యాత్మిక విశేషానికి వేదికైంది. వందల ఏళ్ల నాటి చరిత్రను తనలో దాచుకున్న ఈ గుట్టపై జరిపిన తవ్వకాల్లో పురాతన వరాహ స్వామి, భూదేవి విగ్రహాలు లభ్యమయ్యాయి. విష్ణుమూర్తి తొలి అవతారమైన వరాహమూర్తి విగ్రహం బయటపడటంతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.**

– అక్షరటుడే, భీమ్‌గల్

# ముచ్కూర్ గుట్టపై.. ఆది వరాహస్వామి

- తవ్వకాల్లో బయల్పడ్డ పురాతన విగ్రహాలు
- ఆధ్యాత్మిక శోభతో పులకించిన భీమ్‌గల్
- పెద్దగుట్టపై ఆలయ నిర్మాణానికి గ్రామస్థుల సంకల్పం

ముచ్కూర్ పెద్దగుట్టపై పూర్వం నృసింహస్వామి ఆలయం ఉండేదని తరతరాలుగా స్థానికులు చెప్పుకునేవారు. అయితే, సరైన దారి లేకపోవడం, గుట్టపైకి చేరుకోవడం కష్టతరం కావడంతో భక్తులు ఇన్నాళ్లూ కొండ కింద ఉన్న పాఠశాల వద్దే తమ మొక్కులు చెల్లించుకునేవారు. కేవలం జిల్లా నుంచే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు ఇక్కడికి తరలివస్తుండటం విశేషం. గతంలో ఇక్కడ జరిగిన ప్రాథమిక తవ్వకాల్లో కోనేరు, గుహ ఆనవాళ్లు బయటపడటంతో ఇక్కడో గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రం ఉండేదని చరిత్రకారులు సైతం ధ్రువీకరించారు.

### శ్రమదానంతో సాకారమైన మార్గం

తమ ఆరాధ్య దైవానికి నిలయమైన గుట్టను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో గత రెండు నెలలుగా ముచ్కూర్ గ్రామస్థులు, భక్తులు ఏకమయ్యారు. విరాళాలు సేకరించి, జేసీబీల సాయంతో శ్రమదానం చేసి గుట్టపైకి తాత్కాలిక రహదారిని నిర్మించారు. ఈ క్రమంలో శనివారం గుహ లోపలి భాగాన్ని శుభ్రం చేస్తుండగా, భూగర్భం నుంచి పురాతన విగ్రహాలు దర్శనమిచ్చాయి. స్వామివారే స్వయంగా వెలిశారని భావించిన గ్రామస్థులు మంగళవాయిద్యాలు, జయజయధ్వానాల మధ్య పూజలు నిర్వహించారు.

### త్వరలో భవ్య మందిరం

వరాహస్వామి విగ్రహం లభ్యం కావడంతో గ్రామానికి శుభం జరుగుతుందని భక్తులు విశ్వసిస్తున్నారు. భవిష్యత్తులో దాతల సహకారంతో పెద్దగుట్టపై అద్భుతమైన ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ఇతర రాష్ట్రాల భక్తులు సైతం దర్శించుకునేలా ఈ ప్రాంతాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని గ్రామ పెద్దలు ఈ సందర్భంగా వెల్లడించారు.

# అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి


నగరంలో నివాళులర్పిస్తున్న మాదిగ కులస్తులు



ఎల్లారెడ్డి మండల కేంద్రంలో..

**అక్షరటుడే, ఇందూరు:** మాదిగ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని ఎంఎస్‌సీ జిల్లా అధ్యక్షుడు సరికెల పోశెట్టి తెలిపారు. మాదిగ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని పులాంగ్ చౌరస్తాలో అమర వీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ ఉపకులాల అభివృద్ధి కోసం జరిగిన పోరాటంలో అనేకమంది అమరవీరులయ్యారన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సుదీర్ఘ 30 ఏళ్ల ఉద్యమంలో రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ జరుగుతుందని తెలిపారు. మాదిగల కోసం ప్రాణాలను తృణప్రాయంగా వదులుకున్న వారికి రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు నాగభూషణం, ఉద్యోగ నాయకులు నాంపల్లి, తెడ్డు గంగారం, మహిళా సమాఖ్య నాయకురాలు యమునా, బాబురావు, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శ్యామ్, రమేష్, నగర అధ్యక్షుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఎల్లారెడ్డి మండలంలో..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎస్సీ వర్గీకరణ సాధన కోసం అసువులు బాసిన మాదిగ అమరవీరులకు మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. వర్గీకరణ కోసం తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా 12 మంది పోరాడారన్నారు. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 1994లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి స్థాపించినప్పటి నుంచి మందకృష్ణ ఆదేశాల మేరకు మాదిగలు వర్గీకరణ కోసం పోరాడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కంది పద్మారావు, ఎమ్మార్పీఎస్ ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు శివానంద, నాగిరెడ్డిపేట మండల అధ్యక్షులు తొంట సాయిలు, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బంజారా లెంగి ఉత్సవం

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని సేవాలాల్ చౌరస్తా వద్ద బంజారా సోదరులు హోలీ పండుగను పురస్కరించుకుని లెంగీ ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారా రాష్ట్ర సీనియర్ నాయకుడు బధ్యానాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొని సేవాలాల్ భవానీ మాత మందిర మహోత్సవ జాతర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

## ఆదివాసీ నాయక్‌పోడ్ రాష్ట్ర అడ్‌హక్ కమిటీ ఏర్పాటు

**అక్షరటుడే, ఇందూరు :** ఆదివాసీ నాయక్‌పోడ్ రాష్ట్ర అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్షుడు కూన దయానంద్, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మెసిలేని రాజన్న, పల్ల సత్యనారాయణ పేర్కొన్నారు. డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం శివారులోని ఓ ఫామ్ హౌస్‌లో ఆదివాసీ నాయక్‌పోడ్ రాష్ట్రస్థాయి ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా సీనియర్ నాయకుడు, గౌరవ అధ్యక్షుడు బండారి భోజన్న, జిల్లా అధ్యక్షుడు గాండ్ల రాంచందర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి సంఘం బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్షుడు కూన దయానంద్, మాజీ రాష్ట్ర అధ్యక్షులు మెసిలేని రాజన్న, పల్ల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు పసుల బుచ్చయ్య నేతృత్వంలోని కమిటీ ఆశించిన స్థాయిలో సంఘాన్ని ముందుకు తీసుకెళ్లడం లేదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత బాడీని రద్దు చేస్తున్నామని, త్వరలోనే నూతన రాష్ట్ర స్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని ప్రకటించారు. ఈ విషయాన్ని రాష్ట్ర గిరిజన కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, అధికారికంగా నూతన బాడీ ఎన్నిక ప్రక్రియను చేపడతామని స్పష్టం చేశారు. నూతనంగా ఏర్పడే రాష్ట్ర కార్యవర్గం.. గ్రామస్థాయి నుంచి కులస్థులను ఏకం చేయడమే కాకుండా, ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ ఫలాలు ప్రతి పేదవాడికి చేరేలా కృషి చేయాలని సూచించారు. ఈ ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యే వరకు 13 జిల్లాల నుంచి ఒక్కొక్క సభ్యుడితో కూడిన తాత్కాలిక అడహక్ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వెంకగారి భూమయ్య, మొసలి చిన్నయ్య, గంజి రాజన్న, భూమయ్య, వేంపల్లి గంగాధర్, భీముడు, శంకర్, లింగన్న, నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, జగిత్యాల, కరీంనగర్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తాం




**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి, నిజామాబాద్ పట్టణాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పని చేస్తామని నిజామాబాద్ నగర కార్పొరేషన్ మేయర్ ఉమారాణి, కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి తెలిపారు. ఆదివారం మేయర్, చైర్ పర్సన్‌లతో పాటు ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన ముదిరాజ్ కౌన్సిలర్లకు కామారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం, ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ముదిరాజుల సమస్యల పరిష్కారానికి చైర్ పర్సన్, మేయర్ కృషి చేయాలని సంఘం ప్రతినిధులు కోరారు. మేయర్ ఉమారాణి మాట్లాడుతూ.. తనను ఇంత గౌరవంగా కామారెడ్డికి పిలిచి సన్మానించిన ముదిరాజ్ సంఘం ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. చైర్ పర్సన్ ఉమారాణి మాట్లాడుతూ.. ఇద్దరం ఉమారాణులం కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నామని, ఇద్దరం కూడా ముదిరాజ్ సామాజిక వర్గంలో ఉండడం, ఇద్దరం కూడా గెలుపొందడంతో పాటు ఇద్దరి పేర్లు ఒకటే కావడం యాదృచ్ఛికంగా జరిగిందన్నారు. తాను సాధారణ గృహిణి నుంచి ఈ స్థాయికి రావడానికి తన భర్త శ్రీనివాస్ కారణమన్నారు. తనపై నమ్మకంతో చైర్ పర్సన్ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలుపుతూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ముందుకు సాగుతానన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ పున్న రాజేశ్వర్, మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల నీలకంఠం, జిల్లా అధ్యక్షుడు విఠల్, రాష్ట్ర ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు విజయానంద్ భూపాల్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కాళ్ల గంగారాం, ఉపాధ్యక్షుడు చిట్యాల రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

## జిరాయత్ నగర్ హనుమాన్ ఆలయంలో స్వచ్ఛ భారత్



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని జిరాయత్ నగర్‌లోని హనుమాన్ ఆలయంలో ఆదివారం ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిరాయత్ నగర్‌లోని పురాతన దేవాలయమైన హనుమాన్ ఆలయంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించేందుకు సహకరించిన ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దోండి దత్తాద్రి, కాలనీ వాసులు మామిడి శ్రీనివాస్, దోండి పవన్, పోహార్ సాయి కుమార్, కర్తన్ మణికంఠ, శీల్ యాదాద్రి, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, బొగడమీది ప్రశాంత్, వేదశ్రీ రాజ్ కుమార్, డ్రైవింగ్ స్కూల్ వేణు, గణేష్, యాదగిరి, కృషివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## రిపుల్స్ స్కూల్‌లో తల్లిదండ్రుల పాదపూజ మహోత్సవం



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని రిపుల్స్ పాఠశాలలో తల్లిదండ్రుల పాదపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులపై విద్యార్థుల్లో గౌరవం, కృతజ్ఞతాభావం పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. కార్యక్రమం భావోద్వేగభరితంగా సాగి తల్లిదండ్రులను కదిలించింది. 'విద్యార్థులకు మొదటి గురువులు తల్లిదండ్రులేనని, వారి ఆశీర్వాదమే పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది' అని ఎంఈవో నాగేశ్వరరావు పేర్కొన్నారు. విద్యతో పాటు సంస్కారం కూడా సమానంగా అవసరమని, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో మంచి విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం అనిల్, ఆర్ఐ బాలరాజు, వాణి గడ్డం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటమి గెలుపునకు పునాది: నీలం కళావతి రమేష్



**అక్షరటుడే, కామారెడ్డి:** ఓటమి అనేది గెలుపునకు పునాది అని, ఓటమి చెందితే దిగులు చెందాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి పాలైన 10వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి నీలం కళావతి రమేష్ అన్నారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గడిచిన మున్సిపల్ ఎన్నికల్లో దేవునిపల్లి 10వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేశానన్నారు. అయితే అనుకోకుండా కౌన్సిలర్ గా పోటీ చేసే అవకాశం రావడంతో పోటీలో ఉన్నానని తెలిపారు. ఊహించని విధంగా వార్డు ప్రజల నుంచి తనకు సంపూర్ణ మద్దతు లభించిందని, ప్రచారానికి తక్కువ సమయం ఉన్నా ప్రజలు తన వెంట ఉండి మద్ద తుగా నిలిచారని తెలిపారు. అయితే రాజకీయాల్లో గెలు పు, ఓటమి అనేది సహజమని, గెలిచినప్పుడు గర్వం చూపించడం, ఓటమి తర్వాత బాధపడడం అనేది చేయ డం సరికాదని తన అభిప్రాయమని పేర్కొన్నారు. ఇది తనకు రాజకీయంగా వచ్చిన మొదటి అవకాశమని, ఒక్కసారికే కుంగిపోతే భవిష్యత్తులో ముందుకు వెళ్లలేనన్నారు. గెలిచినా ఓడినా ప్రజల మధ్యనే ఉంటానని, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తనకు 394 ఓట్లు పోలయ్యాయని, తనపై నమ్మకంతో నాకు ఓటు వేసిన వార్డు ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. భవిష్యత్తులో తనకు వార్డు ప్రజలు సహకరిస్తారని ఆశిస్తున్నానన్నారు.